క్లుప్తంగా

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే అన్నా దంపతులు


శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

గిద్దలూరు రూరల్: స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు తన సతీమణి దుర్గాకుమారితో సహా బంధుమిత్రులతో కలిసి తిరుమల శ్రీనివాసుడిని శనివారం దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ దర్శనంలో కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే అన్నా రాంబాబు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెద్దదోర్నాల: పెద్దదోర్నాలలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు మండల కేంద్రంలోని ఒకటో సచివాలయం పరిధిలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చారు.

బీజేపీని బలోపేతం చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

గిద్దలూరు రూరల్: భారతీయ జనతా పార్టీని కింది స్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మంచాల బ్రహ్మేశ్వరప్రసాద్ అన్నారు. భారత ప్రధాని మోదీ పరిపాలన తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక బీజేపీ కార్యాలయంలో శనివారం సంయుక్త మోర్చాల సమ్మేళనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీకి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. దేశ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉండటంతో ప్రపంచ దేశాల్లో మంచి ఖ్యాతి పొందామన్నారు. దేశభద్రత కోసం బీజేపీ అధికారంలో కొనసాగాలన్నారు. జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, నాయకులు రామాంజి, ప్రసాద్ పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు


గాయపడిన జిల్లెలమూడి చౌదరి

ముండ్లమూరు: మండలంలోని బృందావనం వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని పెద ఉల్లగల్లు గ్రామానికి చెందిన జిల్లెలమూడి చౌదరి శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై దర్శిలో పనులు ముగించుకొని తిరిగి ఇంటికి బయల్దేరాడు. మార్గంమధ్యలో దర్శి–అద్దంకి ప్రధాన రహదారిలో బృందావనం వద్ద అదుపుతప్పి ద్విచక్ర వాహనం గేదెను ఢీకొట్టింది. ప్రమాదంలో చౌదరికి గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న కొందరు గమనించి 108కి ఫోన్ చేశారు. 108 సిబ్బంది యోహాన్, వెంకటప్పయ్యలు అక్కడికి చేరుకొని ప్రథమ చికిత్స చేసి దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తీసుకెళ్లారు.

ఘనంగా నాగార్పమ్మ వారి కొలుపులు

బల్లికురవ: మండలంలోని సోమవరప్పాడు గ్రామంలో కొండవర్ధువారి ఇలవేల్పు నాగార్పమ్మ కొలుపులు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను అమరావతి సముద్రస్నానానికి తీసుకెళ్లారు. గురు, శుక్ర, శనివారాల్లో మాతుడుపు, పుట్ట బంగారం, బొల్లావులు, వీరతాళ్లతో గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల పక్కనే ఉన్న నాగార్పమ్మ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, జిల్లాలోని కొండవర్ధు కుటుంబ సభ్యులంతా కొలుపులకు రావడంతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. ఆదివారంతో కొలుపులు ముగించి రాత్రికి అన్నదానం చేస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు.

రేపు అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

చినగంజాం: మండలంలోని రాజుబంగారుపాలెం పంచాయతీ కుక్కలవారిపాలెం గ్రామంలో 12వ తేదీ సోమవారం ఉదయం 7.28 గంటలకు అభయాంజనేయస్వామి ప్రతిష్ట నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం పూజా కార్యక్రమాలతో కార్యక్రమాలను ప్రారంభించారు. 11వ తేదీ ఆదివారం పూజ, 12న విగ్రహ ప్రతిష్ట, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమాలు శ్రీమాన్ పరాశం భోగ శ్రీనివాస మారుతి వరప్రసాద్ భట్టాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

'సంజీవని' కి సంకటం

- మార్కాపురం జిల్లా వైద్యశాలలో రక్త నిల్వల కొరత
- సేకరణకు అనుకూలంగా లేని పరిస్థితులు
- వేసవి సెలవులతో కళాశాలలు మూసివేత
- 15 రోజులుగా ఖాళీగా ఉన్న బ్లడ్ బ్యాంక్



మార్కాపురం బ్లడ్ బ్యాంక్

మార్కాపురం: జిల్లా వైద్యశాలలో రక్త నిల్వలు నిండుకున్నాయి. బ్లడ్ బ్యాంక్‌లో 300 యూనిట్ల రక్తంను నిల్వ ఉండాల్సి ఉండగా.. 35 రోజుల వ్యవధిలో వాడాల్సి ఉంటుంది. రక్తం ఉంటే ఎందరో ప్రాణాలను కాపాడవచ్చు. ప్రమాదానికి గురైన వారికి, ప్రీమెచ్యూర్ డెలివరీ అయిన తల్లులకు, పెద్ద శస్త్రచికిత్సలకు రక్తం అవసరమవుతుంది. అలాగే గాయాలకు గురైన రోగులకు, రక్తహీనతతో బాధపడే రోగులకు, ఇతర శస్త్ర చికిత్సలకు ఎర్ర రక్త కణాలు మాత్రమే కావాల్సి వస్తాయి. రక్తంలోని ఎర్ర రక్తకణాలను, రక్తహీనతతో ఉన్న వ్యక్తికి, ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ప్లాస్మా అనే ద్రావణాన్ని, హిమోఫిలియా అనే బ్లీడింగ్ డిజార్డర్, ప్లేట్‌లెట్స్‌ను డెంగీ, త్రోంబోసైటిమియా వంటి వ్యాధులు ఉన్న వ్యక్తికి ఇవ్వటం ద్వారా ఒక యూనిట్ రక్తం ముగ్గురి ప్రాణాలు కాపాడగలుగుతుంది. మార్కాపురం బ్లడ్ బ్యాంక్ నుంచి సేకరించిన రక్తం ప్యాకెట్లను గిద్దలూరు, యర్రగొండపాలెం, దర్శి, కనిగిరి వైద్యశాలలకు సరఫరా చేస్తుంటారు. అయితే ప్రస్తుతం రక్తం కొరత కారణంగా నిలిపివేశారు.

కొరతకు కారణాలు ఇవే..

గత 30 రోజుల నుంచి కళాశాలలు మూసివేశారు. దీంతో విద్యార్థులు బ్లడ్ డొనేషన్ చేసేందుకు అందుబాటులో లేరు. సుమారు నెల రోజుల నుంచి రక్త నిల్వలు లేక బ్లడ్ బ్యాంక్ ఖాళీగా ఉంది. కేవలం 10 నుంచి 20 ప్యాకెట్లే అందుబాటులో ఉన్నాయి.


రక్తనమూనాలు లేక ఖాళీగా ఉన్న ఫ్రిజ్

స్వచ్ఛంద సంస్థ వారు కూడా చొరవ చూపకపోవడంతో సమస్య అలాగే ఉంది.


రక్తదానం చేసే వ్యక్తుల కోసం ఉన్న బెడ్‌లు

ఆరోగ్యవంతులు రక్తదానం చేయవచ్చు: ఇటీవల బ్లడ్ బ్యాంక్‌లో రక్తం కొరత ఏర్పడింది. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. కళాశాలలకు సెలవులు ఇవ్వటంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్ళిపోయారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను సంప్రదిస్తున్నాం, ఆరోగ్య వంతులు ఎవరైన రక్తదానం చేయవచ్చు ఎటువంటి అపోహాలు వద్దు.



డాక్టర్ సుబ్బారెడ్డి, జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్

తాగునీటికి రూ.66 లక్షలు


బోరు ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

- ప్రజల దాహార్తి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ప్రజల దాహార్తి తీర్చడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని, వేసవికి అనేక ప్రాంతాల్లో బోర్లు అడుగంటడంతో గ్రామాల్లో నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక ఇందిరమ్మ నగర్‌లో తన సొంత నిధులతో వేసిన బోరును ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి తనకు కేటాయించిన కోటి రూపాయల నిధుల్లో ఎక్కువ శాతం నీటి ఎద్దడి నివారణకు కేటాయించామని చెప్పారు. రూ.66 లక్షలు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు కేటాయించి ఎక్కడా తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని, శాశ్వత నీటి పథకాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామని తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటి బోర్లలో నీరు రాని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయిస్తున్నామని, 2019 నుంచి ట్యాంకర్ల యజమానులకు బకాయిలు చెల్లించేందుకు సీఎం జగన్‌మోహన్‌మోహన్‌రెడ్డి నిధులు కేటాయించారని, గ్రామీణ నీటి సరఫరాకు రూ.135.71 కోట్ల బిల్లులు విడుదల అయ్యాయని, పొదిలి సబ్ డివిజన్ పరిధిలో 6,927 పనులకు రూ.134 కోట్లు, ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో 145 పనులకు రూ. 1.71 కోట్లు నిధులు మంజూరు చేశారని చెప్పారు. ప్రజల అవసరాలు తీర్చేందుకు ఎంత ఖర్చు అయినా తమ ప్రభుత్వం వెనకడుగు వేయదని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ స్పష్టం చేశారు. గత టీడీపీ ప్రభుత్వ కాలంలో నీటి పథకాలను నిర్వీర్యం చేశారని, దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల పార్టీ అధ్యక్షులు కె.ఓబుల్‌రెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, ఏకుల ముసలారెడ్డి, అంకిరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట


పూజలు చేస్తున్న మద్దిశెట్టి శ్రీధర్


శాంతి కల్యాణానికి హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ


ప్రత్యేక అలంకారంలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారు

ముండ్లమూరు: మండలంలోని ఈదరలో పెద్దమ్మ వారి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిశెట్టి శ్రీధర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ వారి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు అడపాల శ్రీనివాసరావు, అంబటి వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

మారెళ్లలో ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

మండలంలోని మారెళ్ల పోలేరమ్మ ఆలయ నిర్మాణంలో భాగంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ ఆదేశాల మేరకు ఆయన సోదరుడు మద్దిశెట్టి శ్రీధర్ పాల్గొని లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ

ఈదర గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, సర్పంచ్ వంగల పద్మావతి భర్త శ్రీనివాసరెడ్డిని మద్దిశెట్టి శ్రీధర్ పరామర్శించారు. శ్రీనివాసరెడ్డి ఇటీవల ప్రమాదంలో గాయపడి శస్త్రచికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న శ్రీధర్ పరామర్శించి ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు.

కన్నుల పండువగా శాంతి కల్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అలాగే రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయదేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈవో జి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి. కేశవరావు, ధర్మకర్తలు, గౌరవాధ్యక్షులు రామడుగు కోటేశ్వరరావు, కోశాధికారి పెరుమాళ్ల కోటేశ్వరరావు, కార్యదర్శి రామడుగు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

కురిచేడు: మండలంలోని రెడ్డెన్నపల్లి శ్రీ పట్టాభిరామ స్వామి నూతన ఆలయ,ధ్వజ, కలశ, యంత్ర, శీతల, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శనివారం హాజరయ్యారు. ఆలయ నిర్మాణానికి దర్శి మాజీ శాసనసభ్యుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సహాయ సహకారాలు అందించారు. ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు గ్రామ సర్పంచ్ కాసు భాస్కరరెడ్డి, ఆయన సోదరుడు కాసు బ్రహ్మారెడ్డి, ధనిరెడ్డి వెంకటరెడ్డి, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె అందరినీ ఆప్యాయంగా పలకరించారు. పట్టాభిరామస్వామి శాంతి కళ్యాణంలో వెంకాయమ్మ పాల్గొన్నారు. అనంతరం అన్న సంతర్పణ చేశారు. జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, ఎంపీటీసీ అన్నెం అరుణ, నాయకులు వీరగంథం కోటయ్య, అన్నెం శ్రీనివాసరెడ్డి, ఎన్వీ నాగిరెడ్డి, ఆసుపల్లి చెన్నారెడ్డి, గోగులముడి లింగారెడ్డి, ధనిరెడ్డి కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని తువ్వపాడు దక్షిణంపల్లిలో ఐదు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్న రామచంద్రస్వామి జీవ, ధ్వజ, పోతురాజుస్వామి సహిత పోలేరమ్మ దేవతా ప్రతిష్ట, అభయాంజనేయ


మార్కాపురం: స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


ముస్తాబైన రామచంద్రస్వామి ఆలయం

స్వామి విగ్రహ, శిఖర, కళశ, ఆదిత్య నవగ్ర దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు శనివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు.

మార్కాపురం: పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామివారి పంచమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కళ్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పాలకవర్గ చైర్మన్ రావిపాటి రామారావు, ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి శివశంభర్, అదనపు కార్యదర్శి నిట్టూరి వెంకటరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


కరపత్రాలు విడుదల చేస్తున్న ఇస్మాయిల్, ఇతర నాయకులు

మార్కాపురం: మొదటిసారిగా ఉమ్మడి రాష్ట్రంలో ముస్లింలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ ఉస్మాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇస్మాయిల్ మాట్లాడారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముస్లింలు గుర్తు పెట్టుకుంటారన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో ఎమ్మెల్యే కేపీ ఈద్గాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. షాదీఖానా నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, ముస్లిం విద్యార్థుల కోసం ప్రత్యేక గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు. కౌన్సిలర్లు సిరాజ్, షెక్షావలీ, కోఆప్షన్ సభ్యులు అమీరుల్లాఖాన్, మయూరి ఖాశీం, మున్సిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు డి. మీరావలి, షెక్షావలి, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ చాంద్ బాషా, రహంతుల్లా, వలీ అహమ్మద్, కరీం బాషా, ఖాలీద్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాంప్లెట్లను విడుదల చేశారు.

ఆంజనేయులుకు ఘన నివాళి

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి నుసుం చిన ఆంజనేయులు పార్టీ అభ్యున్నతికి చేసిన సేవలు మరువలేని వని వక్తలు అన్నారు. మాధవరంలో శనివారం ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి తాళ్లూరు మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మద్దిశెట్టి రవీంద్ర, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డిలు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన గ్రామంలో పార్టీ అభ్యున్నతికి, మౌలిక వసతుల ఏర్పాటుకు చేసిన కృషిని కొనియాడారు. ఎస్ఐ ప్రేమ్‌కుమార్, సొసైటీ చైర్మన్ శనివారపు శ్రీనివాసరెడ్డి, సర్పంచిలు వలి, మాజీ సర్పంచి సుబ్బారెడ్డి, పులి కృష్ణారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు పులి ప్రసాద్‌రెడ్డి, నాయకులు గంగిరెడ్డి పాలెం యలమందారెడ్డి పాల్గొన్నారు.


ఆంజనేయులుకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిశెట్టి రవీంద్ర

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో బదిలీపై వెళ్తున్న పలువురు ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్ఎం కర్నాటి తిరుపతిరెడ్డి బేస్తవారిపేట జెడ్పీ బాలికల హైస్కూల్‌కు, ఉపాధ్యాయులు ఎస్.మధుసూదన్‌రెడ్డి, మనోజ్, రమేష్‌లు బదిలీ అయ్యారు. గిద్దలూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎంఎస్ శర్మ బేస్తవారిపేట జెడ్పీ బాలుర హైస్కూల్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.


సన్మానం అందుకుంటున్న ఉపాధ్యాయులు

మహిళలు కిచెన్ గార్డెన్ తయారు చేయాలి

తాళ్లూరు: ప్రకృతి సాగును మహిళా సంఘ సభ్యులు ప్రోత్సహించాలని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు అన్నారు. తూర్పుగంగవరంలో జీవనోపాదుల గ్రామైఖ్య సంఘ లీడర్లు, సభ్యురాళ్లతో ఆయన శనివారం సమావేశమయ్యారు. గతేడాది ప్రకృతి సాగు చేసిన మహిళలు ఈ ఏడాది కూడా సాగు చేసేలా చూడాలని చెప్పారు. పలు రకాలు ప్రకృతి సాగు పద్ధతులు వివరించారు. ప్రకృతి సాగు ఇన్‌చార్జి నరసింహులు, వీఏఏ సీహెచ్ భరత్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రకృతి సాగు ఇన్‌చార్జి నరసింహులు

నేడు వైద్య శిబిరం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని విశ్వభారతి స్కూల్ ఆవరణలో డాక్టర్ బ్రహ్మానందరెడ్డి వైద్యశాల, కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ బ్రహ్మానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యంతో పాటు మందులు, ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు. భోజన వసతి కూడా ఉంటుందన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

కొనకనమిట్ల: రైతులకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు అన్నారు. స్థానిక ఏఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామని వ్యవసాయాధికారి ప్రసన్న రంగలక్ష్మి అన్నారు. ప్రస్తుతం రైతులు పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే జీలుగలు, పెసలు, పిల్లి పెసర, జనుములు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో నమోదు చేసుకుంటే 50 శాతం రాయితే అందజేస్తామన్నారు. వ్యవసాయ సలహా మండలి సభ్యులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.


విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

నిత్యావసరాల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

చీమకుర్తి: చీమకుర్తి గరికమిట్టలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు 2023–24 విద్యా సంవత్సరానికి కూరగాయలు, కోడిగుడ్లు, చికెన్, పండ్లు, పాలు సరఫరా చేసేందుకు ఆసక్తి కలిగిన వారి నుంచి టెండర్ల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తిచేసిన టెండర్ దరఖాస్తు ఫారాలను ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు పాఠశాలలోని టెండర్ బాక్స్‌లో ఉంచాలన్నారు. గడువు దాటిన టెండర్ దరఖాస్తులను స్వీకరించరని తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్న ఎస్ఈబీ అధికారులు

యర్రగొండపాలెం: స్థానిక పుల్లల చెరువు రోడ్డులో అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్న నిందితుడిని ఎస్ఈబీ అధికారులు శనివారం అరెస్టు చేశారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామని, ఈ దాడుల్లో కంచర్ల కేశవులు నుంచి 42 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకొని అతడిని అరెస్ట్ చేశామని ఎస్ఈబీ ఇన్‌చార్జి సీఐ పద్మజ తెలిపారు. దాడుల్లో డీటీఎఫ్ కానిస్టేబుళ్లు ఎం.బాలరంగయ్య, వై.చంద్రశేఖర్ పాల్గొన్నారు.


మద్యం బాటిళ్లు, నిందితుడితో ఎస్ఈబీ సీఐ, కానిస్టేబుళ్లు

అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వాలి

బేస్తవారిపేట: గ్రామీణ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ మాధవరావు సూచించారు. శనివారం మండలంలోని పాపాయిపల్లెలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గృహాలకు తాళాలు వేసుకుని దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దని చెప్పారు. గ్రామాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.